ఖరీఫ్ నారుమడులకు తుఫాన్ తాకిడి



ఆకివీడు: నారుమడులను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో



ఉండి: ముంపునకు గురైన వరిచేను



కాళ్ల: నీట మునిగిన నారుమడులు

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం
- పల్లపు ప్రాంతాలు అతలాకుతలం

ఆకివీడు: ఖరీఫ్ నారుమడులు తుఫాన్ తాకిడికి గురయ్యాయి. 10–15 రోజులు మధ్య వ్యవధి కలిగిన నారుమడులు నీట మునుగుతూ, తేలుతూ ఉన్నాయి. భారీ వర్షం మరింతగా కురిస్తే నారుమడులు పూర్తిగా ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. ఉండి నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు 30,000 ఎకరాల్లో చేపట్టేందుకు సన్నాహాలు చేస్తుండగా సుమారు 1480 ఎకరాల్లో నారుమడులు వేశారు. ఇప్పటికే నాలుగు మండలాల్లో సుమారు 2,222 ఎకరాల్లో నాట్లు వేశారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి పలు గ్రామాల్లో నారుమడులు ముంపునకు గురవుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వేసిన నాట్లు కూడా అక్కడక్కడా నీట మునుగుతున్నాయి. ఆకివీడు మండలంలో 166 ఎకరాల్లో వెదజల్లు పద్ధతిలో ఖరీఫ్ సాగు చేపట్టారు. ప్రస్తుతం ఆయా పొలాల్లో నారు నాలుగు నుంచి ఆరు అడుగుల ఎత్తులో ఉంది. వర్షాలకు పొలాల్లోని పల్లపు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. వెదజల్లులో నారు కుళ్లిపోతే ఆయా ప్రాంతాల్లో నాట్లు వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఆకివీడు మండలంలోని పాతఏరు, చినకాపవరం డ్రెయిన్ ప్రాంతాల్లో నారుమడులకు ముంపు ముప్పు ఏర్పడింది. మండలంలోని ముంపునకు గురైన నారుమడులను ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో ప్రియాంక, అసిస్టెంట్‌లు పరిశీలించారు.

మునిగిన నారును రక్షించుకోవాలి

నారుమడులు వర్షపు నీటిలో ముంపునకు గురైతే అవకాశాన్ని బట్టి నీటిని బయటకు తోడుకోవాలి. వర్షాలు తగ్గిన తరువాత నీటిని పూర్తిగా బయటకు తోడేసిన తరువాత యూరియా, పొటాష్‌ను చల్లుకొని నారును రక్షించుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కేఎస్ఎస్ శ్రీనివాసరావు సూచించారు.

నిండా ముంచిన వర్షం

ఉండి: గురువారం ఉదయం నుంచి మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నారుమడులు, నాట్లు వేసిన వరి చేలు నిండా మునిగాయి. కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాలకు చిలుకూరు, యండగండి, ఉప్పులూరు, ఉండిలోని పలు ప్రాంతాల్లో నారుమడులు నీటమునగడంతో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించి నివారణకు సూచనలు, సలహాలు అందించారు. అయితే మరోసారి వరుణుడు తన ప్రతాపం చూపడంతో గురువారం మండల వ్యాప్తంగా సుమారు 85 ఎకరాల పైబడి నారుమడులు, సుమారు 500 ఎకరాల్లో నాట్లు వేసిన వరి పొలాలు పూర్తిగా నీట మునిగాయని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య తెలిపారు. ఇప్పటికే మండలంలో 1750 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. అయితే గురువారం సాయంత్రం వరకు వర్షం కురుస్తున్న దృష్ట్యా రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. వర్షం నీటికి బొండాడ మేజర్ డ్రెయిన్ ఎగదన్నడంతో వరి పొలాల్లో వర్షపు నీరు బయటకు వెళ్లడం లేదు. వర్షం తగ్గిన వెంటనే నారుమడులు, నాట్లు వేసిన వరి పొలాల్లో నీరు లేకుండా చర్యలు చేపడితే వరి పొలాలను కాపాడుకోవచ్చునని అధికారులు చెబుతున్నారు. అయితే ఎడతెరిపి లేని వర్షం వల్ల వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

వర్షంతో పారిశుద్ధ్య సమస్యలు

అలాగే పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దీనిపై ఆయా గ్రామాల అధికారులు అప్రమత్తంగా ఉండి నీటిని తరలించే కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మండలాధికారులు చెబుతున్నారు.

భారీ వర్షానికి నీట మునిగిన నారుమడులు

కాళ్ల: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి నారుమడులు నీట మునిగాయి. గురువారం ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తూనే ఉంది. మండలంలో 4118 ఎకరాల్లో వరి సాగవుతుంది. దీనిలో ఇప్పటికే 272 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. అయితే భారీ వర్షానికి 65 ఎకరాల నారుమడులు నీట మునిగినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అదే విధంగా నాట్లు వేసిన పొలాలు కూడా నీట మునిగినట్లు అధికారులు స్పష్టం చేశారు.

స్తంభించిన జన జీవనం



ఉధృతంగా ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్

భీమవరం: పట్టణంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా జనజీవనం స్తంభించి పోయింది. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన వర్షం రాత్రి వరకూ కొనసాగుతూ సుమారు 8 గంటల్లో 50.4 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. వర్షం కారణంగా చిరు వ్యాపారులు, తోపుడుబండి వ్యాపారులు దుకాణాలు తెరవలేదు. పట్టణంలోని ప్రజలు బయటకు రావడానికి అవకాశం లేకుండా పోయింది. వర్షం కారణంగా అనేక ప్రాంతాల్లో డ్రెయిన్లు సక్రమంగా లాగక రోడ్లపై నీరు నిలిచిపోయి ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. మెట్ట ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షం కారణంగా పట్టణం నడిబొడ్డు నుంచి ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్ పొంగి ప్రవహిస్తుంది.

ఎడతెరిపిలేని వర్షం –రోడ్లు జలమయం

పాలకోడేరు: గురువారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. పల్లపుప్రాంతాలు జలమయమై, జనం బయటకు రావడానికి కూడా వీలులేక ఇళ్లకే పరిమితమయ్యారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన జోరువాన అంతకంతకు పెరుగుతూ సాయంత్రం వరకు హోరున కురుస్తూనే ఉంది. దీంతో గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. నారుమడులలోకి భారీగా వర్షంనీరు చేరడంతోనారు నీటమునిగింది. పాలకోడేరు మండలంలోని రహదారులన్నీ జలమయంగా మారాయి. జాతీయ రహదారి విస్సాకోడేరు, గొరగన మూడి, పెన్నాడ గ్రామాల్లో రోడ్లు పెద్ద పెద్ద గోతులు పడ్డాయి.నాలుగు రోజుల క్రితం గోతులు పూడ్చేందుకు వేసిన కంకర వర్షానికి కొట్టుకుపోయి, గోతులు మిగిలాయి.

రోడ్లన్నీ జలమయం

భీమవరం అర్బన్: మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారు జాము నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తునే ఉంది. వాతావరణ శాఖ మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ముంపు నీరంతా దెయ్యాలతిప్ప, నాగిడిపాలెం, తోకతిప్ప, కొత్తపూసలమర్రు, దొంగపిండి, లోసరి గ్రామాలన్నీ జలమయమయ్యాయి. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షపు నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు తూతూమంత్రంగా సాగుతుండడంతో అనారోగ్యం బారిన పడతామన్న భయం ప్రజల్లో నెలకొంది. ఈ ఖరీఫ్ సీజన్ అలస్యంగా మొదలు కావడంతో కొన్ని రోజుల కితమే వేసిన వరి నాట్లు వర్షార్పణ మవుతున్నాయి. ఆదిలోనే వరుణుడు దెబ్బని చవి చూడాల్సి రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



బస్‌డిపో సమీపంలో రోడ్లపైకి చేరిన వర్షం నీరు



గొరగనమూడిలో జాతీయ రహదారిపై వర్షం నీరు నిలిచిపోయిన దృశ్యం



గునుపూడిలో వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

క్లుప్తంగా

21 రోజుల్లో బర్త్ సర్టిఫికెట్ తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి

కాళ్ల: పుట్టిన 21 రోజులలోగా డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌ను తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి తెలిపారు. ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కాళ్ల సెక్టార్ పరిధిలోని పెదఅమిరంలో మిషన్ శక్తి 100 డేస్ స్పెషల్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ గురువారం నిర్వహించారు. మిషన్ స్కీమ్స్ గురించి గ్రామంలో అవగాహన కల్పించారు . కార్యక్రమంలో భాగంగా పుట్టిన 21రోజులలో డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్స్ తీసుకొని వెంటనే ఆధార్‌కార్డులు చేయించుకోవాలని స్పష్టం చేశారు. పిల్లలు నైపుణ్యాలు ప్రదర్శించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

భీమవరం: తమవైపు చూసి సిగరెట్టు ఎందుకు తాగుతున్నావని ముగ్గురు యువకులు కలిసి మరో యువకుడిపై దాడి చేసిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం టూటౌన్‌లోని డాక్టర్ బీవీరాజు మార్గ్‌లో రహదారి పక్కన హేమంత్ అనే యువకుడు ద్విచక్రవాహనం ఆపి సిగరెట్ కాల్చుకుంటున్నాడు. అతనికి కొద్ది దూరంలో మరో ముగ్గురు సిగరెట్లు కాల్చుకుంటుండగా, మావైపు చూస్తు సిగరెట్టు ఎందుకు కాలుస్తున్నావంటూ హేమంత్‌పై దాడి చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు.

35 మందికి ఉచిత రక్త పరీక్షలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. గురువారం తణుకు బ్యాంక్ కాలనీలో గల కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ మోగంటి రాజేశ్ పరీక్షలను నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పెనుమర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రామచంద్రరావుపేటలోని పేద కుటుంబానికి ఒక బస్తా బియ్యం, కిరాణా సరుకులు అందజేశారు. రూ.2 వేలు ఆసుపత్రి ఖర్చులు అందజేశారు. మానవత అధ్యక్షుడు పచ్చ వెంకటేశ్వరరావు, సెక్రటరీ యర్రా ఆంజనేయ స్వామి, కోశాధికారి యెగ్గిన శరత్ బాబు, కురుమల వెంకటాచలం, శ్రీనివాసరాజు, బురిడీ సతీష్, చేకూరి బంగ్రారాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచిత శిక్షణ

పాలకొల్లు సెంట్రల్: భారత ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ), విజయవాడ ఎంఎస్ఎంఈ, ఎస్ఎస్ఐసీ వారి సంయుక్త సౌజన్యంతో ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సీపెట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ న్యూ డిల్లీ వారి సౌజన్యంతో నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ (ఎస్ఎస్ఎస్‌హెచ్) స్కీమ్ ద్వారా మెషీన్ ఆపరేటర్, ప్లాస్టిక్స్ ప్రాసెస్సింగ్ అనే నైపుణ్యాభివృద్ధి శిక్షణను 5 నెలలు ఇస్తారన్నారు. వారికి సర్టిఫికేట్, అనంతపురం, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై ప్రాంతాల్లో ప్లాస్టిక్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు అందిస్తామన్నారు. వివరాలకు కె.సుందరరావు 9398050255లో సంప్రదించాలన్నారు.

పాఠశాలలకు సెలవు ప్రకటించండి



వర్షంలో తడిసి ఇంటికి వెళుతున్న విద్యార్థులు

ఆకివీడు: తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని రెండు రోజుల నుంచి వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుంది. మంగళవారం రాత్రి నుంచి భారీ, మోస్తరు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈదురు గాలులు వీస్తూనే ఉన్నాయి. గురువారం రోజంతా వాన కురవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్కూల్ నుంచి ఇంటికి వచ్చే సమయంలో కూడా వర్షంలో తడిసి వెళ్లాల్సి వచ్చింది. శుక్రవారం కూడా విస్తారంగా వర్షాలు, ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో పాఠశాలలకు సెలవు ప్రకటించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

రేపటి నుంచి గురుపూర్ణిమ ఉత్సవాలు

ఉండి: మండలంలోని ఉండి కొత్తపేటలో శ్రీలక్ష్మీ గణపతి దత్తసాయి ఆలయంలో గురుపూర్ణిమ మహోత్సవాలు ఈ నెల 20,21 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ ఎస్ చలపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా 20వ తేదీ శనివారం ఉదయం కాకడ హారతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21వ తేదీ ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చినుకు పడితే చిత్తడే...



చిత్తడిగా ఆర్ అండ్ బీ రహదారి

కాళ్ల: కాళ్ల నుంచి కోలనపల్లి మీదుగా ఆకివీడు వెళ్లి ఆర్ అండ్ బీ రహదారి చినుకుపడితే చిత్తడిగా మారుతుంది. కొలనపల్లి నుంచి కాళ్ల రోడ్డు గోతులమయంగా మారింది. ఈ మార్గం గుండా ప్రయాణం చేసే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. రహదారి మొత్తం మట్టి రోడ్డును తలపిస్తుంది. ఈ రహదారి ప్రయాణం అంటేనే ప్రయాణికులు వాహనదారులు భయపడే పరిస్థితి నెలకొంది. రోడ్డు మరమ్మతులు చేపట్టి, నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

పాఠశాలలకు నాడు–నేడు నిధులను విడుదల చేయాలి



డీఆర్‌వో ఉదయ భాస్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు

భీమవరం అర్బన్: మండలంలోని తుందుర్రు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 4 అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంజూరైన నాడు–నేడు నిధులలో కొంత దారి మళ్లాయని వాటిని వెంటనే విడుదల చేసి పాఠశాల అభివృద్ధి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె ఉదయ్ భాస్కర్‌కు కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు విజ్ఞప్తి చేశారు. భీమవరంలో ఆయన డీఆర్ఓ ఉదయ్ భాస్కర్‌కు గురువారం దారిమళ్లిన నిధులు విడుదల చేసి పాఠశాలలో అదనపు గదులు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరసవతి మణికంఠ ఉన్నారు.

బాల్య వివాహాలతో దుష్పరిణామాలే

పాలకొల్లు అర్బన్: బాల్య వివాహాలతో కలిగే దుష్పరిణామాలను ప్రతీ ఒక్కరూ తెలుసుకొని వాటిని పూర్తిగా వ్యతిరేకించాలని జిల్లా మిషన్ శక్తి వన్‌స్టాప్ కౌన్సిలర్ ఎం.సూర్యప్రభ కోరారు. ఉల్లంపర్రులో డాక్టర్ సబితా మహిళా జూనియర్ కళాశాలలో మిషన్ శక్తి పథకం వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆర్యవైశ్య మండల అధ్యక్ష కార్యదర్శుల ఏకగ్రీవ ఎన్నిక

భీమవరం అర్బన్: ఆర్యవైశ్య మండల అధ్యక్షుడిగా కంచర్ల వెంకటరమణారావు (కొండ), కార్యదర్శిగా అనంతపల్లి నాగవెంకట చలపతి, కార్యవర్గ సభ్యులను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భీమవరంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు ఆదేశాను సారం ఉపాధ్యక్షుడు పరుచూరి నాగేశ్వరరావు ఎన్నికల అధికారి సమక్షంలో రాష్ట్ర మహాసభ కోశాధికారి వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు కురిశేటి రమేష్, మండల సంఘ కార్యవర్గ సభ్యులు సలహాలు, సూచనలు మేరకు అధ్యక్షుడిగా కంచర్ల వెంకట రమణారావు, కార్యదర్శిగా అనంతపల్లి నాగ వెంకట చలపతి, కోశాధికారిగా చక్కా శ్రీనివాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు సంఘపెద్దలు, నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పెసల వెంకటేశ్వరరావు, వోలిటి శ్రీనివాస్ గుప్తా, మండవల్లి ఈశ్వర్, కనగర్ల కిషోర్, కురిసేటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో నూతనంగా ఎన్నికైన మండల ఆర్యవైశ్య అధ్యక్ష, కార్యదర్శులు

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

భీమవరం: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డాక్టర్ వి.యస్. శిల్ప, డాక్టర్ జె. ఎస్. కుమార్ తెలిపారు. కె.జి.ఆర్.ఎల్ ఫార్మశీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాయామం , సరైన పౌష్టికాహారం వలన ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. మహిళలో రుతుక్రమ సమస్యల వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం విద్యార్థులకు, కళాశాల సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కె.జి.ఆర్.ఎల్ ఫార్మశీ డైరెక్టర్ కె. నాగేశ్వరరావు, డి. రాఘవ, వైస్ ప్రిన్సిపాల్ కె . నిర్మల, అడపా లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



కెజిఆర్‌ఎల్ కళాశాలలో ఆరోగ్య అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శిల్ప

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే పులవర్తి రామాంజనేయులుకు ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కుమారి, వరలక్ష్మి మాట్లాడుతూ కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని గతంలో చేసిన ఆందోళన ఫలితంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను మినిట్స్ కాపీని కూడా ఎమ్మెల్యే అందజేశామని తెలిపారు. ప్రసూతి సెలవులు గాని రిటైర్మెంట్ బెనిఫిట్స్ గాని అమలు కావడం లేదని చివరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా మాకు ఇవ్వడం లేదన్నారు. ఈ సందర్భంగా శాసనసభలో మా సమస్యల మీద చర్చించి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు ఎం ఆంజనేయులు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, నిర్మల, దుర్గ, సంతోష్ వాణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేరామాంజనేయులుకు వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

ప్రమాదం జరిగితే గానీ పట్టించుకోరా?

- వర్షపు ముంపు నీటిలో జాతీయ రహదారి
- అధికారులపై మండిపడుతున్న విద్యార్థులు, స్థానికులు



నీట మునిగిన జాతీయ రహదారి

ఆకివీడు: ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జాతీయ రహదారిపై వెళ్లాల్సిన దుస్థితి ఆకివీడులోని స్థానిక జెడ్పీ స్కూల్ వద్ద నుంచి ప్రధాన సెంటర్ వరకూ ఏర్పడింది. గురువారం కురిసిన దుక్కి వర్షానికే ఈ ప్రాంతం నీట మునిగిపోయి రహదారి కన్పించడం లేదు. మరో రెండు రోజులు తుఫాన్ ప్రభావం ఉందని చెప్పడంతో రహదారి మరింతగా మునిగి వాహనదారులు, స్థానికులకు తీవ్ర ఇబ్బంది కలగనుంది. ఈ ప్రాంతం వర్షపు ముంపునీటితో గత 20 రోజులుగా రహదారి ఉన్నప్పటికీ నగర పంచాయతీ, జాతీయ రహదారుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని అనేక సార్లు సాక్షి వెలుగులోకి తీసుకువచ్చింది. ఇటీవల దీనిపై నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ అది జాతీయ రహదారుల శాఖకు సంబంధించిందని, తమకు సంబంధం లేదని తేల్చి చెప్పారు. తమకు పారిశుద్ధ్య సిబ్బంది అంతంత మాత్రంగానే ఉన్నారని, వాళ్ల పనులు మా వాళ్లు చేయడానికి ఖాళీ లేదని స్పష్టం చేశారు. జాతీయ రహదారుల శాఖ అధికారులు ఈ ప్రాంతాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. జాతీయ రహదారి బైపాస్ రోడ్డు వేసేందుకు సన్నాహాలు చేయడంతో ఈ ప్రాంతంలోని రహదారిని ఆ శాఖ అధికారులు కనీస మరమ్మతులు చేయడం లేదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. వర్షాలకు నీట మునిగి రహదారి కన్పించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వేగంగా వస్తున్న వాహనాలు, సైకిళ్లపై వెళ్లుతున్న విద్యార్థులతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన తప్పనిసరి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సూపర్ వైజర్ నిర్మల

ఉండి: మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమాలు, చట్టాలపై మహిళలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ యండగండి ప్రాజెక్టు సూపర్‌వైజర్ వి.నిర్మల్ అన్నారు. ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు సీడీపీవో ఆదేశాల మేరకు పీఎం మిషన్ శక్తి కార్యక్రమాన్ని గురువారం యండంగండి సెక్టార్‌లోని యండగండి 1 అంగన్వాడీ కేంద్రం నందు మహిళలకు పలు కార్యక్రమాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. వీటిలో ముఖ్యంగా సఖీ స్టాఫ్ సెంటర్, ఈవ్ టీజింగ్, గృహ హింస, వరకట్న వేధింపుల సమస్యలు, చట్టాలపై వివరించారు. అలాగే బేటీ బచావో, బేటీ పడావో, పీసీపీఎన్‌డీటీ బాల్య వివాహాలు, బాలల హక్కులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. అలాగే ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించడంపైనా వారికి అవగాహన కల్పించారు. అనంతరం పూర్వ ప్రాథమిక విద్య యొక్క ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.